క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక



ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న విద్యార్థిని సుధ

అమలాపురం టౌన్: జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనల్లో అమలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని సీహెచ్ అనీల సుధ సత్తా చాటింది. సోలార్ సెన్సార్ కేటిల్ షెడ్ ప్రాజెక్ట్ ప్రదర్శన జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. రామచంద్రపురం శ్రీకృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనల్లో అనీల సుధ వ్యక్తిగత విభాగం నుంచి రాష్ట్ర స్థాయి ఎంపికను సాధించింది. ఈ సందర్భంగా పాఠశాలలో శనివారం సాయంత్రం జరిగిన అభినందన సభలో సుధను ప్రధానోపాధ్యాయుడు డి.గౌరీశంకర్, గైడ్ టీచర్ కేవీఎస్ లక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా లక్ష తులసి పూజ



లక్ష తులసి పూజల్లో పాల్గొన్న భక్తులు

తాళ్లరేవు: మండలంలోని జార్జిపేట వేణుగోపాల స్వామివారి ఆలయంలో లక్ష తులసి పూజ శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ చోడి శ్రీరామ్మూర్తి పర్యవేక్షణలో వేద పండితులు వాడపల్లి గోపాలాచార్యులు నేతృత్వంలో వేణుగోపాల స్వామికి విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

భీమనపల్లిలో తాచుపాము హల్‌చల్



భీమనపల్లిలో పామును పట్టుకుంటున్న గణేష్‌వర్మ

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లిలో కంకటాల అయ్యన్నకు చెందిన బిస్కట్ల షాపు వద్ద శనివారం తాచుపాము హల్‌చల్ చేసింది. వెంటనే స్థానికులు గ్రామానికి చెందిన స్నేక్ క్యాచర్ జంపన గణేష్‌వర్మకు సమాచారం అందించారు. ఆయన ఘటనా స్థలానికి చేరుకుని చాకచక్యంగా పామును బంధించి సురక్షిత ప్రాంతంలో వదిలిపెట్టారు.

ఆలయానికి స్టీలు గ్రిల్ సమర్పణ



ఆంజనేయస్వామి ఆలయానికి భక్తులు సమకూర్చిన స్టీలు గ్రిల్

అమలాపురం టౌన్: స్థానిక రవణం మల్లయ్య వీధిలో వేంచేసి ఉన్న శ్రీఅభయ ఆంజనేయ స్వామి ఆలయం 8వ వార్షికోత్సవం సందర్భంగా పలువురు దాతలు ఆలయానికి రూ.1.50 లక్షలతో స్టీలు గ్రిల్, రూ.70 వేలతో స్వామికి అభయ హస్తం సమర్పించారు. ఆలయం వద్ద వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. అనంతరం స్వామి గ్రామోత్సవం వైభవంగా జరిగింది.

ఉచితంగా భగవద్గీత పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేస్తున్న శివానంద నిమాయి తదితరులు

అమలాపురం రూరల్: మండలంలోని జనుపల్లెలో ఇస్కాన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా భగవద్గీత పుస్తకాలను జనుపల్లి సర్పంచ్ గణాల భారతి, వంటెద్దు వెంకయ్య నాయుడు, అమలాపురం అవుట్ పోస్ట్ సెంటర్ ఇన్‌చార్జ్ శివానంద నిమాయిదాస్‌ల చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ యన్నాబత్తుల పద్మ, పెంకే రామ్మోహన్‌రావు, వేమన సూర్యనారాయణ, గొవ్వాల రమణ పాల్గొన్నారు.



అమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు



పెదగాడవిల్లిలో ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి



వేంకటేశ్వరస్వామి ఆలయంలో సుదర్శన హోమం చేస్తున్న భక్తులు

ఆలయాలకు ముక్కోటి శోభ

- ఉత్తర ద్వార దర్శనానికి పోటెత్తిన భక్త జనం
- అమలాపురం వెంకన్నను దర్శించుకున్న ఎంపీ అనురాధ



అమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు



అమలాపురం వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ఎంపీ చింతా అనురాధ

అమలాపురం టౌన్: ముక్కోటి ఏకాదశి సందర్భంగా అమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటుచేసిన ఉత్తర(వైకుంఠ) ద్వార దర్శనం కోసం భక్తులు శనివారం పోటెత్తారు. ఆలయ ప్రాంగణమే కాకుండా ఆలయం ఎదురుగా ఉన్న 216 జాతీయ రహదారిలో సైతం భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. శనివారం తెల్లవారుజాము ఉంచి రాత్రి వరకూ ఆలయానికి భక్తుల తాకిడి కనిపించింది. అమలాపురం ఎంపీ చింతా అనురాధ, రాష్ట్ర దృశ్య కళల అకాడమీ చైర్‌పర్సన్ కుడుపూడి సత్య శైలజ, అమలాపురం, అల్లవరం మండల పరిషత్ అధ్యక్షులు కుడుపూడి భాగ్యలక్ష్మి, ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామగోపాల్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని తదితరులు ఆలయం ఉత్తర ద్వారం ద్వారా వచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి, ఈవో దూనబోయిన సాయిబాబు, ధర్మకర్తలు భక్తులకు సేవలందించారు. ఆలయ కల్యాణ మండపంలో అన్నదానం నిర్వహించారు.

ఉప్పలగుప్తం: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని భీమనపల్లి, విలసవిల్లి, కూనవరం, పెదగాడవిల్లి, ఎస్.కొత్తపల్లి గ్రామాల్లో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయాలు, రామాలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. పెదగాడవిల్లిలో ఉన్న వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో పెద్దింటి వెంకట రామకృష్ణాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేసి పుష్పాలతో అలంకరించారు.

ముమ్మిడివరం: ముమ్మిడివరం భూదేవి, శ్రీదేవి సమేత కేశవస్వామి, పల్లిపాలెం శ్రీహరిసాకేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు, స్థానిక షిరిడీ సాయి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పల్లిపాలెం శ్రీహరి సాకేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకం, తులసి పూజ, పంచ హారతులు, సాయంత్రం పుష్కరిణిలో తెప్పోత్సవం నిర్వహించారు. అమలాపురం ఎంపీ చింతా అనురాధ ఉత్తర ద్వార దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు.

తాళ్లరేవు: చరిత్ర ప్రసిద్ధిగాంచిన పి.మల్లవరం శ్రీదేవీ, భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో తెల్లవారుజామున 3 గంటల నుంచి ఆలయ అర్చకులు ఖండవిల్లి శ్రీనివాసాచార్యులు, ఖండవిల్లి రంగాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు జరిపారు. అనంతరం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. కేశవపురంలోని శ్రీదేవీ, భూదేవీ సమేత కేశవస్వామివారి ఆలయం, ప్రధాన రహదారిలోని భూసమేత శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయం, చొల్లంగి వెంకటేశ్వరస్వామివారి ఆలయం, సుంకరపాలెం వేణుగోపాలస్వామివారి ఆలయాల్లోనూ ఘనంగా పూజలు జరిగాయి.

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంక బిళ్ల వారి వీధిలో వేంచేసియున్న పద్మావతి అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామివారి సన్నిధిలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామికి అభిషేకాలు, విశేష పూజలు చేశారు. అనంతరం లక్ష్మీగణపతి, సుదర్శన హోమాలు జరిపారు. స్వామివారి సన్నిధిలో భక్తుల కోసం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ వీరబాబు, రూరల్ ఎస్‌ఐ అందే పరదేశి, ఎంపీటీసీ అంకం హిమ భారతి తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోన: మండలంలోని పల్లంలో సద్గురువు శ్రీరామ దండియ్య దాసు స్థాపించిన శాంతి ఆశ్రమంలో పీఠాధిపతి సత్యానందం ప్రత్యేక పూజలు చేశారు. ముక్కోటి ఏకాదశి ప్రత్యేకతను భక్తులకు వివరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాట్రేనికోన పంచాయతీ గచ్చకాయల పోర ఎంజీఆర్ కాలనీలో వేంచేసి ఉన్న శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

యానాం: స్థానిక భూసమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో శనివారం ముక్కోటి ఏకాదశి పర్వదిన వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాతసేవ, మూలవిరాట్టుకు పంచామృతాభిషేకం, విశేష అలంకరణ, సహస్ర నామార్చన, గంగ సింధూరం పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం నుంచి ఉత్తర ద్వారం ద్వారా భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం స్వామివారిని గరుడ వాహనంలో పురవీధులలో ఊరేగించారు. అనంతరం శాంతి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.



పల్లిపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఎంపీ చింతా అనురాధ



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న పి.మల్లవరం వేంకటేశ్వర స్వామివారు



పల్లంలో శాంతి ఆశ్రమంలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ఉప్పలగుప్తం: మండలంలోని మునిపల్లి గ్రామ పంచాయతీ పరిధి మునిపల్లి కోటిగట్టు ప్రాంతంలో రూ.17 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు శనివారం శంకుస్థాపన చేశారు. ఎంపీ చింతా అనురాధ సమకూర్చిన నిధులు రూ.10 లక్షలు, పంచాయతీ నిధులు రూ.7 లక్షలతో సీసీ రోడ్డును నిర్మిస్తున్నట్టు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి నిమ్మకాయల హనుమంతు శ్రీనివాసరావు, దొనిపాటి వెంకటేశ్వరరావు, నాగమణి, మీరాసాహెబ్, చీకురుమెల్లి శైలజ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మునిపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ రామచంద్రరావు

అంధుల పాఠశాలకు వితరణ



లూయిా అంధుల పాఠశాలలో దుప్పట్లు, టవల్స్ అందిస్తున్న విద్యార్థులు

అమలాపురం రూరల్: కామనగరువు ఆదిత్య స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు శనివారం అమలాపురం లూయిా అంధుల పాఠశాలను సందర్శించి వారికి దుప్పట్లు, తలగడలు, టవల్స్, పండ్లు అందజేశారు. ఇలాంటి సేవా కార్యక్రమం విద్యార్థుల సమక్షంలో జరిపించడం వల్ల విద్యార్థుల్లో సామాజిక స్పృహ, మానవత్వం సాటి వారికి సహాయం చేసే గుణాలను పెంపొందించవచ్చని ప్రిన్సిపల్ రాంప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా లూయిా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ వితరణ చేసిన విద్యార్థులను అభినందించారు.

వ్యక్తి అదృశ్యం



జగదీష్

తాళ్లరేవు: గాడిమొగ రిలయన్స్ ఇండస్ట్రీస్ ఉద్యోగి సంగాడి జగదీష్ శుక్రవారం సాయంత్రం నుంచి కనిపించకుండా పోయారు. కోరంగి ఎస్‌ఐ ఎస్.రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం విశాఖపట్టణం జిల్లా పెదగంట్యాడ గ్రామానికి చెందిన జగదీష్ రిలయన్స్ కంపెనీలో ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఈ నెల 21వ తేదీ సాయంత్రం కంపెనీ నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కంపెనీ చుట్టుపక్కల వెతికినా కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కంపెనీ ప్రతినిధుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు. జగదీష్ ఆచూకీ తెలిస్తే కోరంగి పోలీస్‌స్టేషన్‌లో లేదా 94407 96558 ఫోన్ నెంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు.

నూతన ఎస్‌ఐలకు సత్కారం



ఎస్.కొత్తపల్లిలో కుంచే శ్రీలతను సత్కరిస్తున్న పార్టీ నాయకులు



గోపవరంలో తాళ్ల రమేష్‌ను సత్కరిస్తున్న పార్టీ నాయకులు

ఉప్పలగుప్తం: ఇటీవలే ఎస్‌ఐ ఉద్యోగాలు సాధించిన ఎస్.కొత్తపల్లి గ్రామానికి చెందిన కుంచే శ్రీలత, గోపవరం గ్రామానికి చెందిన తాళ్ల రమేష్‌లను మండలానికి చెందిన పలువురు నాయకులు శనివారం సత్కరించారు. జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, వైఎస్సార్ సీపీ మండల కార్యదర్శి పినిపే జయరాజు, సర్పంచ్‌లు కడిమి చిన్నవరాజు, పెయ్యిల రాజ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు పెట్టా అప్పారావు, కొంకి ఏడుకొండలు, సొసైటీ అధ్యక్షుడు ఊటాల రామాంజనేయులు, కాట్రు కృష్ణ తదితరులు శ్రీలత, రమేష్‌లను వారి నివాసాలకు వెళ్లి సత్కరించి తల్లిదండ్రులను అభినందించారు.

చేనేత కార్మికులకు పరికరాల అందజేత



ఇంజరంలో కార్మికులకు పరికరాలు అందజేస్తున్న సర్పంచ్ వెంకట శివరామప్రసాద్ తదితరులు

తాళ్లరేవు: చేనేత కార్మికులకు ఉపకరించే పరికరాలతో పాటు సోలార్ లైటింగ్ యూనిట్స్‌ను ఇంజరం సర్పంచ్ ముద్దన వెంకట శివరామప్రసాద్ శనివారం అందజేశారు. స్థానిక చేనేత సహకార సంఘ భవనంలో జరిగిన కార్యక్రమంలో అవుట్ సైడ్ క్లస్టర్ డెవలప్‌మెంట్ కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వ నిధులతో మంజూరైన యూనిట్‌లను 46 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ సహాయ అభివృద్ధి అధికారి దంగేటి రాంబాబు, సొసైటీ మాజీ చైర్మన్ బళ్లకోటి మల్లేష్, పెయ్యల కొండబాబు, సీహెచ్ సర్వేశ్వరరావు, పి.సాయి పాల్గొన్నారు.

స్వామికి చందన అలంకరణ



చందన అలంకరణలో ఈదరపల్లి లక్ష్మీనరసింహస్వామి

అమలాపురం రూరల్: మండలంలోని భట్లపాలెంలో కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి మహా పర్వదినం సందర్భంగా కల్యాణ వేంకటేశ్వరస్వామిని చందనంతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈదరపల్లిలో లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోనూ స్వామివారిని చందనంతో అలంకరించారు.

యూత్ విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శిగా దాసం



శ్రీరామ చంద్రమూర్తి

అల్లవరం: వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ విభాగ ప్రధాన కార్యదర్శిగా అల్లవరం గ్రామానికి చెందిన దాసం శ్రీరామచంద్రమూర్తిని నియమిస్తూ శనివారం అమరావతిలోని పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. అల్లవరం మండల యూత్ అధ్యక్షుడిగా శ్రీరామచంద్రమూర్తి సేవలందించారు. ఈ సందర్భంగా శ్రీరామచంద్రమూర్తికి ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా జాతీయ రైతు దినోత్సవం



రైతులను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

యానాం: యానాంలో ఫార్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు యర్రా లక్ష్మణరావు, కాటంశెట్టి త్రిమూర్తులు, గాంధీ, పోలిశెట్టి అబ్బులు, కోన కొండబాబులను ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మాజేటి సత్యభాస్కర్, మాజేటి సత్యమూర్తి, దాసరి మంగ, యర్రా జగన్నాథరావు తదితరులు ఘనంగా సత్కరించారు. రైతులకు తగిన గుర్తింపునివ్వాలన్న తలంపుతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధ్యక్షుడు సత్యభాస్కర్ పేర్కొన్నారు.

స్వామి సన్నిధిలో అధ్యయన ఉత్సవాలు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని సన్నిధిలో శనివారం ఐదు రోజులు పాటు అర్చకులు నిర్వహించనున్న అధ్యయన ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బుధవారం వరకూ నిర్వహించే ఈ ఉత్సవాల్లో స్వామివారి సన్నిధిలో ఆయనను నిత్యం కొలిచిన భక్తులైన ఆళ్వార్లను కొలువుదీర్చి వీటి నిర్వహణకు ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యంలో స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యులు, అర్చకుడు సుదర్శనం రమేష్ శ్రీకారం చుట్టారు. ఆలయ ఏసీ వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న డీఐఈవో సత్యనారాయణరెడ్డి తదితరులు

అమలాపురం టౌన్: ఇటీవల జిల్లా కలెక్టరేట్‌లో 'ఇ-కామర్స్, డిజిటల్ వర్తక శకంలో వినియోగదారుల రక్షణ' అనే అంశంపై నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో తమ విద్యార్థులు విజయ దుర్గ, బిందు విజేతలుగా నిలిచారని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కవల కోటిలింగం తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ (ఎంపీసీ) చదువుతున్న విద్యార్థిని పీవీవీ విజయదుర్గ వ్యాస రచన పోటీల్లో ద్వితీయ బహుమతిని, ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ (బైపీసీ) చదువుతున్న విద్యార్థిని పీకేఎస్‌ఎస్ బిందు వక్తృత్వ పోటీల్లో ద్వితీయ బహుమతిని సాధించారని ఆయన పేర్కొన్నారు. కళాశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి (డీఐఈవో) సత్తి వీర వెంకట సత్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ కోటిలింగం చేతుల మీదుగా రూ.వెయ్యి వంతున నగదు బహుమతులు అందజేసి అభినందించారు.

ఉత్సాహంగా క్రిస్మస్ వేడుకలు

యానాం: స్థానిక యానాం పబ్లిక్ స్కూల్‌లో క్రిస్మస్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. అనంతరం క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భారతి, డైరెక్టర్ గుడాల బాలాజీ సుధాకర్, టీచర్లు జాస్మిన్, భీమారావు, సావిత్రి ఆండాళ్, లలిత పాల్గొన్నారు. స్థానిక రీజెన్సీ పాఠశాలలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్రీస్తు జన్మదిన ప్రాధాన్యతపై ప్రసంగించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం టీవీఎస్‌ఎస్‌వీ ప్రసాదరావు, భీమ్ జ్యోతి, శ్రీదేవి, మాధవి, అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

జి.వేమవరం విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

ఐ.పోలవరం: అటల్ టింకరింగ్ ల్యాబ్ పోటీల్లో జి.వేమవరం జెడ్పీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో 57వ స్థానంలో నిలిచారని పాఠశాల హెచ్‌ఎం సలాది వెంకటరమణ శనివారం తెలిపారు. సుమారు 12 వేల ప్రాజెక్టులలో 57వ స్థానం, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మెదటి స్థానం సాధించారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు జి.రాజమౌళి, డి.హనిత ప్రసన్నలతో పాటు గైడ్ టీచర్ యు.వీర వెంకట్రావును డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్ రామచంద్రరావు, నాగఫణి శర్మ, జిల్లా విద్యాశాఖాధికారి కమలకుమారి, ఏఈఓలు శాలెం రాజు, నాయుడు రామచంద్రరావు అభినందించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణి వందన

అమలాపురం టౌన్: స్థానిక ఆకొండి సింహాచలం సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అమలాపురం యర్రమల్లివారి వీధిలోని వరసిద్ధి హనుమాన్ మందిరం వద్ద గత మూడు రోజులుగా జరిగిన సంస్కృతీ ఉత్సవ్‌లో పాల్గొన్న విజేతలకు అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణి పిల్లి వందన చేతుల మీదుగా శనివారం బహుమతులు ప్రదానం చేశారు. మన సంస్కృతీ సంప్రదాయాలకు సంబంధించి బొమ్మ పాటలు, భగవద్గీత శ్లోకాలు, రామాయణ, మహాభారతం తదితర అంశాలపై పోటీలు జరిగాయి. విజేతలకు స్వర్ణ, రజత, కాంస్య పతకాలను అందించి అభినందించారు.

రామమందిర సందర్శనకు ఆహ్వానించాలి

అంబాజీపేట: వచ్చే ఏడాది 22న అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా అక్షతల శోభయాత్రను నిర్వహించి అయోధ్య రామమందిర సందర్శనకు ఆహ్వానించాలని జిల్లా విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు భమిడిపాటి కృష్ణమూర్తి అన్నారు. పుల్లేటికుర్రులో విశ్వహిందూ పరిషత్ మండల ప్రచారక్ కడలి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అయోధ్య రామ మందిరం నుంచి వచ్చిన వితరణ అక్షతలు గ్రామాల ప్రముఖులకు శనివారం అందించారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల బీజేపీ ఎస్సీ మోర్చా జోనల్ ఇంచార్జి కొల్లి సూర్యారావు, కముజు శ్రీనివాసు, అప్పన గణపతిరావు తదతరులు పాల్గొన్నారు.